
నాడు కళకళ.. నేడు వెలవెల

- గ్రీన్‌బెల్ట్‌పై కూటమి నేతల కన్ను
- పచ్చదనంపై వేటు


ఆహ్లాదకరంగా వాకింగ్ ట్రాక్


గ్రీన్‌బెల్ట్ పార్కులో సిమెంట్ బెంచీలు


కసరత్తులో...


రాత్రి వేళ ఎల్ఈడీ కాంతులు

విశాఖ విద్య:

ఎయిర్ పోర్టు నుంచి విశాఖ నగరంలోకి వచ్చే వారికి ఎన్ఏడీ సెంటర్ స్వాగత ద్వారంగా నిలుస్తోంది. ఆ నేపథ్యంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఈ ప్రాంత అభివృద్ధికి పెద్దపీట వేసింది. మౌలిక వసతులు కల్పించడంతో పాటు జాతీయ రహదారిపై ప్రయాణం సాగించే వారికి ఆహ్లాదం పంచేలా గ్రీన్ బెల్ట్ అభివృద్ధి చేసింది. ప్రజారోగ్యంపై శ్రద్ధ చూపి ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేసింది. పిల్లలు ఆడుకోవడానికి వీలుగాఆట పరికరాలతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దింది. ఎన్ఏడీ నుంచి మద్దిలపాలెం(సీఎంఆర్ సెంట్రల్) సెంటర్ వరకు గ్రీన్ బెల్ట్‌కు కొత్త హంగులు తీసుకొచ్చింది. మహిళల కోసం ప్రత్యేక వాకింగ్ ట్రాక్‌లు ఏర్పాటు చేసింది. జిగేల్ మనేలా ఎల్ఈడీ లైట్లు ఏర్పాటు చేశారు. ఇదంతా గ్రీన్ బెల్ట్‌లో గత వైభవం.




పచ్చదనం పై వేటు




పచ్చదనానికి పొగ

నేడు:

ఆహ్లాదం పంచాల్సిన గ్రీన్ బెల్ట్ కూటమి నేతల కబంధ హస్తాల్లోకి పోతుంది. పచ్చదనం పెంచే పచ్చని చెట్లను సైతం నేలకూల్చేసి వ్యాపార స్థావరాలుగా మార్చేస్తున్నారు. ఎన్ఏడీకి సమీపంలోని కాకానినగర్ వద్ద ప్రసుతం ఇలాంటి దృశ్యాలే కనిపిస్తున్నాయి. నగరపాలక సంస్థ అధికారులు ఏమాత్రం పట్టించుకోకపోడంతో ప్రజావసరాల కోసం అభివృద్ధి చేసిన గ్రీన్ బెల్ట్ నేడు కళాహీనంగా మారింది. నాడు చిన్నా పెద్దలతో కళకళలాడిన ఓపెన్ జిమ్‌లు, పార్కులు నేడు నిర్వహణ లేక వెలవెలబోతున్నాయి.

క్లుప్తంగా

42 పాడి పశువులకు వైద్య సేవలు


మందులు అందజేస్తున్న వైద్యులు

విశాఖ విద్య: గవర జగ్గయ్యపాలెంలో శనివారం పాడిపశువులకు గర్భకోశవ్యాధి నివారణకు వైద్య శిబిరం నిర్వహించారు. పశు వైద్యాధికారి డాక్టర్ సుజాత ఆధ్వర్యంలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ సహకారంతో దీన్ని ఏర్పాటు చేశారు. శిబిరంలో డాక్టర్ సౌజన్య, డాక్టర్ సుజాత పాల్గొని 42 పశువులకు వివిధ రకాల వ్యాధులకు చికిత్స అందించారు. దూడలకు నట్టల నివారణ మందు పట్టారు. పశువులకు గర్భకోశ వ్యాధికి సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

చెల్లూరికి ప్రతిభా పురస్కారం


చెల్లూరి భాస్కరరావు

మల్కాపురం: ప్రముఖ చిత్రకారుడు, సామాజిక సేవా కార్యకర్త చెల్లూరి భాస్కరరావు ప్రతిభ పురస్కారానికి ఎంపిక అయ్యారు.అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవాని పురస్కరించుకుని కాకినాడకు చెందిన హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ వారు 30 ఏళ్ల నుంచి సామాజిక సేవా రంగంలో ఉత్తమ సేవలను అందిస్తున్న చెల్లూరి భాస్కరరావును గుర్తించి ప్రతిభ పురస్కారానికి ఎంపిక చేశారు. డిసెంబర్ 10న కాకినాడలో జరిగే మానవ హక్కుల దినోత్సవం కార్యక్రమంలో పురస్కారం అందుకోనున్నారు.ఈ ప్రాంతానికి చెందిన పలువురు చిత్రకారులు,సామాజిక సేవా కార్యకర్తలు ఆయనకు అభినందనలు తెలిపారు.

పింఛన్ల పంపిణీ


పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే గణబాబు

మల్కాపురం: జీవీఎంసీ 58, 59, 60 వార్డుల్లో పలువురి లబ్ధిదారులకు సామాజిక పింఛన్లను ఎమ్మెల్యే గణబాబు పంపిణీ చేశారు. శ్రీహరిపురం వద్ద జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ త్వరలో కొత్త పింఛన్లు మంజూరు చేస్తామని చెప్పారు. నాయకులు అంగ దుర్గాప్రశాంతి, మాత శ్రీను,పాండ్రుగు జయరాజ్ పాల్గొన్నారు.

కాశీ విశ్వేశ్వర ఆలయంలో పూజలు

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు పరిధిలోని హరిహర క్షేత్రంలో కొలువుదీరిన కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీక మాసం సందర్భంగా జరిగిన ప్రత్యేక పూజల్లో వార్డు కార్పొరేటర్ పి.వి. సురేష్ దంపతులు పాల్గొని స్వామికి విభూది, బిల్వాపత్రాలు, పలు నదుల నుంచి జలాలతో అభిషేకాలు చేపట్టారు.ఆలయ కమిటీ ప్రతినిధులతో పాటు భక్తులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రుద్ర హోమం


హోమం గుండాన్ని దర్శించుకుంటున్న భక్తులు

విశాఖ విద్య: జీవీఎంసీ 52వ వార్డు మర్రిపాలెం వుడా లే అవుట్‌లోని వరసిద్ధి వినాయక ఆలయంలో కార్తీకమాసోత్సవాలు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆలయంలో రుద్ర హోమం జరిపించారు. ఆలయ కమిటీ పెద్దలు, కాలనీ వాసులు కుటుంబ సమేతంగా వేడుకలో పాల్గొన్నారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. భక్తుల గోత్రనామాలతో అర్చకులు ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ పెద్దలు డి. సూర్యనారాయణ, ప్రసాద్ రెడ్డి, ఐవీ శంకరరావు, డాక్టర్ శిరీష, వెంకటేశ్వరరావు, రత్నకుమారి, సునీత పాల్గొన్నారు.

ప్రజా చైతన్యంతో ఎయిడ్స్‌కు చెక్

మల్కాపురం: ఎయిడ్స్‌ను నియంత్రించడానికి ప్రజల్లో చైతన్యం తీసుకురావడమే సరైన చికిత్స అని జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రాం అధికారి ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి అన్నారు. మల్కాపురం సెయింట్ ఆన్స్ మహిళా కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో శనివారం ఎయిడ్స్ వ్యాధిపై క్విజ్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ రక్తం అవసరమైన వారు లైసెన్స్ ఉన్న బ్లడ్ బ్యాంక్‌ల్లో మాత్రమే సేకరించాలని సూచించారు.డిస్పోజబుల్ సిరంజిలు, సూదులు మాత్రమే వాడాలన్నారు.భార్య భర్తలు ఒకరికొకరు నమ్మకంతో,విశ్వాసంతో జీవించాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు వై.అనసూయాదేవి,వి.అంజలీదేవి,నదియా,సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులతో ఎన్ఎస్ఎస్ అధికారి భాగ్యలక్ష్మి

హడలెత్తించిన నాగుపాము

సింథియా: జీవీఎంసీ 63వ వార్డు క్రాంతినగర్ ప్రాంతంలో యారాడ గ్రామానికే వెళ్లే మార్గం సమీపాన గడ్డికుప్పల వద్ద రోడ్డు మధ్యలో 7 అడుగుల నాగుపాము బుసలు కొడుతూ స్థానిక ప్రజలను హడలెత్తించింది. దీంతో జయేంద్రకాలనీ నుంచి యారాడ గ్రామానికి వెళ్లే ప్రయాణికులు, ప్రజలు నిలిచిపోయారు. వెంటనే స్నేక్ క్యాచర్ నాగరాజుకి ఫోన్ ద్వారా సమాచారం అందించడంతో హుటాహుటిన అక్కడికి చేరుకున్న నాగరాజు చాకచక్యంగా పామును పట్టుకున్నారు. దీంతో రాకపోకలు యథావిధిగా కొనసాగాయి. స్నేక్‌క్యాచర్ నాగరాజు మాట్లాడుతూ వర్షాల వల్ల పాములు నివాస స్థలాలను వదిలి జనావాసాల్లోకి రావడం సర్వసాధారణమని, భయపడాల్సిన అవసరం లేదన్నారు. పాములు కనిపిస్తే కొట్టి చంపకుండా స్నేక్ సేవర్ సొసైటీకి సమాచారం అందిస్తే వాటిని పట్టుకుని కాపాడుతారని తెలిపారు.


నాగుపామును పట్టుకున్న స్నేక్ క్యాచర్ నాగరాజు

పుస్తెలతాడు చోరీ చేసిన యువకుడి అరెస్టు

పెదగంట్యాడ: వృద్ధురాలి మెడలో పుస్తెలతాడు చోరీ చేసిన నిందితుడిని న్యూపోర్టు పోలీసులు అరెస్టు చేశారు. న్యూపోర్టు పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో క్రైం ఏడీసీపీ ఎన్.మోహనరావు వివరాలు వెల్లడించారు. విజయనగరం జిల్లా వేపాడ మండలానికి చెందిన వబ్బిన కోటరావు అలియాస్ కోటి (24) తల్లిదండ్రులతో కలసి గాజువాకలో నివాసం ఉంటున్నాడు. చెడు వ్యసనాలు, బెట్టింగ్‌లకు అలవాటు పడిన అతను అప్పులు చేశాడని వివరించారు. అప్పులు ఎక్కువ కావడంతో సులభంగా డబ్బు సంపాదించాలని దొంగతనాలకు దిగాడని చెప్పారు. ఇందులో భాగంగా ఒంటరిగా ఉంటున్న మహిళలను లక్ష్యంగా చేసుకున్నాడు. ఈ నేపథ్యంలో జీవీఎంసీ 65వ వార్డు పరిధిలోని వికాస్‌నగర్‌లో వుడా ఎంఐజీలోని ఫస్ట్ ఫ్లోర్‌లో శెట్టి రమాభాయి (75) అనే మహిళ ఒంటరిగా ఉండడాన్ని గుర్తించాడు. ఈ నెల 24న ఆమె ఇంట్లోని వంటగదిలో ఉన్న సమయంలో అతను వెనుక నుంచి వెళ్లి ఆమెను పట్టుకొని మెడలోని రెండు తులాల పుస్తెలతాడు తెంచేశాడన్నారు. ఆ సమయంలో జరిగిన పెనుగులాటలో ఆమె చేతి వేలికి గాయమైందన్నారు. దీనిపై ఫిర్యాదు అందుకున్న న్యూపోర్టు క్రైం సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ అప్పలరాజు బృందంతో కలసి సీసీ టీవీ ఫుటేజీలను సేకరించారని చెప్పారు. నిందితుడిని గుర్తించి శ్రామికనగర్‌లో అదుపులోకి తీసుకుని విచారించామని తెలిపారు. పుస్తెలతాడును నగరంలోని రామాటాకీస్ సమీపంలోని ఓ గోల్డ్ ఫైనాన్స్ సంస్థకు విక్రయించాడని, దీంతో తాము ఆ పుస్తెలతాడుతో పాటు అతని వద్ద నుంచి రూ.64,900 రికవరీ చేశామన్నారు. అలాగే అతను వినియోగించిన స్కూటీని కూడా చోరీ చేసినట్టు గుర్తించామన్నారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. ఈ కేసును ఛేదించిన పోలీస్ సిబ్బంది రామ్మూర్తి, ఎంవీ రమణ, రాజేష్, జయేంద్ర, రాజు, లక్ష్మణ్, సీహెచ్ గణపతి, నరేష్‌ను అభినందించారు.


వివరాలు వెల్లడిస్తున్న క్రైం ఏడీసీపీ మోహనరావు

5 నుంచి విశాఖ ఆర్గానిక్ మేళా

సీతమ్మధార: ఈ నెల 5 నుంచి నిర్వహించనున్న విశాఖ ఆర్గానిక్ మేళాను విజయవంతం చేయాలని భారత కిసాన్ సంఘ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు జలగం కుమార్ స్వామి పిలుపునిచ్చారు. పీఅండ్‌టీ కాలనీలోని కేశవ్ సేవా సమితి కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఈ నెల 5 నుంచి 8వ తేదీ వరకు ఆంధ్రా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల గ్రౌండ్‌లో 5వ ప్రకృతి ఆధారిత పంటల మేళా నిర్వహిస్తున్నామన్నారు. రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు వినియోగించి పండించే పంటలు అనారోగ్యం కలిగిస్తాయని, పర్యావరణానికి నష్టం కలుగుతుందని వివరించారు. ప్రకృతి ఆధారిత పంటలను ఆహారంగా తీసుకుంటే ఆరోగ్యకరమన్నారు. గో ఆధారిత ప్రకృతి వ్యవసాయ దారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దాట్ల సుబ్రహ్మణ్య వర్మ మాట్లాడుతూ 5వ తేదీ ఉదయం 10 గంటలకు రైతుల సమ్మేళనం, 6న మీ ఆరోగ్యం మీ చేతిలో, 7న ఫుడ్ ప్రాసెసింగ్, 8న మిద్దె తోటలు కార్యక్రమాలు జరుగుతాయని చెప్పారు. గ్రీన్ క్లైమేట్ ఎన్‌జీవో వ్యవస్థాపక కార్యదర్శి జె.వి.రత్నం పాల్గొన్నారు.


వివరాలు వెల్లడిస్తున్న జలగం కుమార్ స్వామి

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

సింథియా: జీవీఎంసీ 62వ వార్డు పరిధి దుర్గానగర్ గుడివాడఅప్పన్నకాలనీలోని శివసాయి ఆలయ వద్ద ఆదివారం శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గణబాబు శిబిరాన్ని ప్రారంభిస్తారని వార్డు అధ్యక్షుడు మజ్జిమాలి నాయుడు తెలిపారు. ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఉచిత శిక్షణ.. ఉద్యోగ అవకాశాలు

అక్కిరెడ్డిపాలెం: హెచ్‌పీసీఎల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్, బొల్లినేని మెడ్ స్కిల్స్ సంయుక్తంగా బ్యూటీషియన్, హోటల్ మేనేజ్‌మెంట్, జనరల్ డ్యూటీ మేనేజ్‌మెంట్ (నర్సింగ్), ప్రొడక్షన్ మెషీన్ ఆపరేటర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు షీలానగర్‌లోని బొల్లినేని మెడ్ స్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్.నాగేశ్వరరావు శనివారం తెలిపారు. ఈ కోర్సులు విశాఖపట్నం ఆర్టీసీ కాంప్లెక్స్‌లోని సెకండ్ ఫ్లోర్‌లో గల స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్‌లో నిర్వహించనున్నట్టు తెలిపారు. కోర్సుల్లో చేరేందుకు ఇంటర్, డిప్లమో, ఐటీఐ, పదో తరగతి పూర్తి చేసి 18 నుంచి 28 ఏళ్ల లోపు విద్యార్థినీ, విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. మూడు నెలల పాటు అనుభవజ్ఞులైన అధ్యాపకులతో ఉచిత శిక్షణతో పాటు యూనిఫాం, బుక్స్, ఏసీ క్యాంపస్ వంటి సదుపాయాలు కల్పిస్తామన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు వివరాలకు 7993011695, 9121999654 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

యూజీడీ కార్మికులను ఆప్కాస్‌లో విలీనం చేయాలి

అల్లిపురం: యూజీడీ అవుట్ సోర్సింగ్ కార్మికులను ఆప్కాస్‌లో విలీనం చేసి, జీవో 36 ప్రకారం రూ.21 వేలు, రూ.24,500 వేతనం చెల్లించాలని జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) అధ్యక్ష, కార్యదర్శులు టి.నూకరాజు, ఉరుకూటి రాజు డిమాండ్ చేశారు. శనివారం సీఐటీయూ కార్యాలయంలో జరిగిన యూనియన్ సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. జీవీఎంసీ కమిషనర్‌కు యూనియన్ తరపున లిఖిత పూర్వకంగా తెలిపిన తర్వాత అధికారులు ప్రభుత్వ అనుమతి కోసం లేఖ రాశారని తెలిపారు. సమావేశంలో యూనియన్ గౌరవాధ్యక్షుడు పి.వెంకటరెడ్డి పాల్గొన్నారు.

ఎలక్ట్రికల్ సర్వీస్ కోర్సులో శిక్షణ

కంచరపాలెం: స్థానిక కంచరపాలెం పాత పారిశ్రామిక శిక్షణ కేంద్రం(ఐటీఐ)లో స్కిల్ హబ్(ఏపీఎస్ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో ఎలక్ట్రికల్ సర్వీస్ టెక్నీషియన్ కోర్సులో 3 నెలల పాటు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ జె.శ్రీకాంత్ తెలిపారు. 10వ తరగతి ఆ పైన చదువుతున్న వారు దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

స్టీల్‌ప్లాంట్ రక్షణ వాగ్దానం నిలబెట్టుకోవాలి


దీక్షలో పాల్గొన్న ఐద్వా నాయకులు

సీతమ్మధార: ఎన్నికల్లో ఇచ్చిన స్టీల్‌ప్లాంట్ రక్షణ వాగ్దానాన్ని ముఖ్యమంత్రి నిలబెట్టుకోవాలని ఐద్వా నాయకులు కోరారు. ఈ మేరకు జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరాహార దీక్షలో పాల్గొన్నారు. స్టీల్‌ప్లాంట్ రక్షణకు చేస్తున్న పోరాటం 1342వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు కావస్తుందన్నారు. విశాఖ ప్రజలు, కార్మికులు, స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయితే స్టీల్ ప్లాంట్‌ని కాపాడతారు అని భావించారు అన్నారు. అయితే ఇంత వరకు స్టీల్‌ప్లాంట్ రక్షణకు ప్రధానితో ఒక్కసారి కూడా ఆయన మాట్లాడినట్లు లేదన్నారు. కేంద్రంలో బీజేపీకి, మోదీకి వంత పాడుతున్నారన్నారు. ఇప్పటికైనా స్టీల్‌ప్లాంట్ రక్షణకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.పద్మ, వై.సత్యవతి, కె. మణి, బి.భారతి, కె.కుమారి, ఆర్. విమల, బి.మమత, ఎం. నిర్మల, కె.సంతోషం, జి. మణి, కె.సత్యవతి, ఎం. నిర్మల, ఆర్. పార్వతి, ఆర్. ముత్యాలమ్మ, పి. మహాలక్ష్మి పాల్గొన్నారు.

చలిగాలులు.. చిరు జల్లులు


వర్షానికి తడిసి ముద్దయిన రోడ్లు


వర్షానికి గొడుగే ఆధారం

మల్కాపురం: ఫెంగల్ తుపాను కారణంగా పారిశ్రామిక ప్రాంతంలో శనివారం ఉదయం నుంచి తెరిపి లేకుండా జల్లులు మాదిరిగా, మరో సారి మోస్తారుగా వర్షం కురవడంతో పలు రోడ్లు తడిసి ముద్దయ్యాయి.శీతాకాలం కావడంతో చలిగాలులు ఓ వైపు,మరో వైపు వర్షపు జల్లులు కురవడంతో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

- వినియోగదారులకు తీవ్ర అసౌకర్యం

విశాఖ విద్య: గోపాలపట్నం పరిసర ప్రాంతాల్లో గడిచిన 24 గంటల్లో విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయం ఏర్పడడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న ఒక వాణిజ్య భవనం ఆధునీకీకరణ పనుల్లో భాగంగా ఏర్పాటు చేసిన పరంజా పాక్షికంగా పడిపోవడం కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగినట్టు తెలుస్తోంది. పునరుద్ధరణ పనుల్లో స్థానిక విద్యుత్ సిబ్బంది కొంత అలసత్వం వహించడంతో శుక్రవారం సాయంత్రం నుంచి శనివారం సాయంత్రం వరకు అనేక సందర్భాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. ఓ పక్క తుపాను నేపథ్యంలో ప్రజానీకం ఇళ్లకే పరిమితం కాగా, ఇలాంటి సమయంలో విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయం కలగడంతో అసహనం వ్యక్తం చేశారు. విద్యుత్ శాఖ అధికారులకు పలు మార్లు ఫిర్యాదు చేసినప్పటికీ ఫలితం అంతంత మాత్రమే అని వినియోగదారులు ఆరోపిస్తున్నారు.

కాగా విద్యుత్ తీగలపై పరంజా పడిపోయిన కారణంగా విద్యుత్ సరఫరాలో జరిగిన హెచ్చుతగ్గులకు స్థానికంగా నివాసం ఉంటున్న ప్రభుత్వ విప్ గణబాబు గృహంలో కూడా విద్యుత్ ఉపకరణాలు దెబ్బతిన్నట్టు తెలుస్తోంది.

కన్యాశుల్కంపై విద్యార్థులకు పోటీలు


విజేతలైన విద్యార్థులతో నిర్వాహకులు

విశాఖ విద్య: మహాకవిగురజాడ వేంకట అప్పారావు 109వ వర్ధంతి సందర్భంగా ఎన్ఏడీ కొత్తరోడ్డులోని రామకృష్ణా పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయులు పి. గోవిందరావు ఆధ్వర్యంలో గురజాడ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అతిథిగా హాజరైన చినసూర్యనారాయణ మాట్లాడుతూ గురజాడ వ్యక్తిత్వాన్ని కన్యాశుల్కం నాటకం ద్వారా మనం గ్రహించవచ్చని కొనియాడారు. సభాధ్యక్షుడు జీవీ రవీంద్రుడు మాట్లాడుతూ కన్యాశుల్కం నాటకంపై పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. 8,9,10వ తరగతి విద్యార్థులతో 22 టీంలు పాల్గొన్నాయి. ఇందులో ప్రథమ బహుమతి లోకేశ్వరి, అభిజ్ఞ, సాయి చైతన్య విద్యా నికేతన్ గాజువాక, ద్వితీయ బహుమతి శ్రీరామకృష్ణా స్కూల్, శాంతినగర్, తృతీయ బహుమతి రామకృష్ణా స్కూల్, ఎన్ఏడీ కొత్తరోడ్డు, కన్సొలేషన్ బహుమతి హారిక - టీం, డీఏవీ స్కూల్, బుచ్చిరాజుపాలెం విద్యార్థులు గెలుపొందగా, వారికి నిర్వాహకులు బహుమతులు అందించారు.